## క్లుప్తంగా

### అప్పన్న సన్నిధిలో చంద్రశేఖర్ ఆజాద్



సింహాద్రి అప్పన్న ఆలయంలో ఐపీఎస్ అధికారి చంద్రశేఖర్ ఆజాద్ కుటుంబం

సింహాచలం: శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామిని ఐపీఎస్ అధికారి చంద్రశేఖర్ ఆజాద్ కుటుంబ సమేతంగా ఆదివారం దర్శించుకున్నారు. ఆలయంలోని కప్పస్తంభాన్ని ఆలింగనం చేసుకున్నారు. ఆయన పేరిట అంతరాలయంలో స్వామికి అర్చకులు పూజలు నిర్వహించారు. వేద ఆశీర్వచనం అందించారు. ఆలయ సంప్రదాయం ప్రకారం స్వామివారి ప్రసాదం, జ్ఞాపికను ఏఈవో ఆనంద్‌కుమార్ అందజేశారు.

### ‘ఉపాధి’ నిధులతో సమగ్రాభివృద్ధి

- గ్రామాల్లో త్వరితగతిన అభివృద్ధి పనులు
- ఎమ్మెల్యే పంచకర్ల రమేష్‌బాబు



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే పంచకర్ల రమేష్‌బాబు

పెందుర్తి: మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం నిధులతో నియోజకవర్గంలోని గ్రామీణ ప్రాంతాల్లో అభివృద్ధి పనులు శరవేగంగా నిర్వహించనున్నట్లు ఎమ్మెల్యే పంచకర్ల రమేష్‌బాబు అన్నారు. సుజాతనగర్‌లోని ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో ఆదివారం నిర్వహించిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఉప ముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్ సారథ్యంలో రాష్ట్రంలోని 13,326 పంచాయతీల్లో ఏకకాలంలో గ్రామ సభలు నిర్వహించి, జాతీయ స్థాయిలో ప్రశంసలు అందుకోవడం శుభపరిణామం అన్నారు. పంచాయతీ వ్యవస్థ బలోపేతానికి కృషి చేస్తున్న పవన్‌కల్యాణ్‌కు కృతజ్ఞతలు తెలిపారు. నియోజకవర్గంలో ఇప్పటికే గ్రామసభల ద్వారా గ్రామాల్లో అభివృద్ధి పనులకు ఉపాధి హామీ నిధుల కేటాయింపులు చేశామన్నారు. ప్రాధాన్యతాక్రమంలో గ్రామాల్లో అభివృద్ధి పనులు పూర్తి చేస్తామన్నారు. గ్రామాల అభివృద్ధిలో స్థానిక ప్రజాప్రతినిధులు, అధికారులు సమన్వయంతో పనిచేసి ప్రజలకు అభివృద్ధి ఫలాలు అందించాలని సూచించారు. అంతిమంగా ప్రజా శ్రేయస్సు కోసమే తమ పాలన ఉంటుందన్నారు. సమావేశంలో కార్పొరేటర్ బల్ల శ్రీనివాసరావు, బీజేపీ నియోజకవర్గ కన్వీనర్ గొర్లె రామునాయుడు, కూటమి నాయకులు వనం సత్యనారాయణ, బలిరెడ్డి అప్పారావు, అయిత సింహాచలం తదితరులు పాల్గొన్నారు.

### నీట్ పీజీలో సాయికీర్తన ప్రతిభ



కర్రి సాయి కీర్తన

సబ్బవరం: పీజీ వైద్య విద్య ప్రవేశాలకు జాతీయ స్థాయిలో నిర్వహించిన నీట్‌లో సబ్బవరానికి చెందిన కర్రి సాయికీర్తన 883వ ర్యాంకు సాధించారు. ఆమె తండ్రి కర్రి కన్నంనాయుడు కూడా వృత్తి రీత్యా డాక్టర్. స్థానిక డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ గురుకుల కళాశాల విద్యార్థులకు వైద్య సేవలు అందిస్తుంటారు. తమ కుమార్తె ఈ ర్యాంకు సాధించడం పట్ల ఆనందం వ్యక్తం చేశారు. సాయి కీర్తన 2017–18 నుంచి 2023–24 వరకు సిద్ధార్థ ప్రభుత్వ మెడికల్ కళాశాలలో ఎంబీబీఎస్ విద్య అభ్యసించారు. ఎక్కడా కోచింగ్ తీసుకోకుండా, ఇంటి వద్ద ప్రిపేర్ అయ్యి, నీట్ పీజీ ఆలిండియా 883 ర్యాంక్ సాధించడం పట్ల కుటుంబ సభ్యులు, స్థానికులు అభినందించారు.

### చిన్నికృష్ణుల వేషధారణ ప్రదర్శన నేడు

గోపాలపట్నం : కృష్ణాష్టమి సందర్భంగా కొత్తపాలెం ప్రసన్న వేంకటేశ్వరాలయంలో సోమవారం సాయంత్రం చిన్నారుల బాలగోపాలుడి వేషధారణ ప్రదర్శన ఉంటుందని ఆలయ నిర్వాహకులు తెలిపారు. స్థానిక చిన్నారులను చిన్ని కృష్ణుల అలంకరణలో ఆలయానికి తీసుకురావాలని కోరారు. సంస్కార భారతి ఆధ్వర్యంలో చిన్నారులకు మన సంస్కృతి, సంప్రదాయాలు తెలియజేసేందుకు ఈ ప్రయత్నం చేస్తున్నామని తెలిపారు.



### ప్రతి ఒక్కరి ఐడెంటిటీ నమోదు చేయాలి



ఆస్పత్రిలో ఉన్న పేషెంట్ కోసం ఎవరు వస్తున్నారో? ఎవరు వెళ్తున్నారో? ప్రతి ఒక్కరి ఐడెంటిటీ నమోదు చేయాలి. అందుకు అవసరమైన భద్రతా సిబ్బందిని ఏర్పాటు చేయాలి. అప్పుడే వైద్యులకు భద్రత ఉంటుంది. లేదంటే ఆస్పత్రికి ఎవరు వస్తున్నారో.. వెళ్తున్నారో తెలియని దుస్థితి. పేషెంట్ తాలూకా అటెండర్స్ విషయంలో చాలా ఖచ్చితమైన నిర్ణయాలు తీసుకోవాలి. అటెండర్స్ గుంపులుగా వచ్చి, అడిగితే వైద్యులపై తిరగబడుతున్నారు. మద్యం సేవించి చాలా మంది వస్తున్నారు. వారిని నియంత్రించేందుకు ప్రత్యేక భద్రత అవసరం.

– తన్వీని, హౌస్ సర్జన్, ఆరోగ్య కేంద్రం, అడవివరం

### ప్రాణదాతలపై దాడులు దారుణం



ఆపదలో ఉన్న వారికి ప్రాణాలు పోసే వైద్యులపై దాడులకు పాల్పడటాన్ని తీవ్రమైన నేరంగా పరిగణించాలి. ముఖ్యంగా మహిళా వైద్యులపై దాడులకు పాల్పడడం చాలా దారుణం. వైద్యులపై దాడులకు పాల్పడిన వారిని కఠినంగా శిక్షించాలి. ఇటీవల కోల్‌కతాలో వైద్యురాలిపై హత్యచేసుకున్న ఘటన వైద్య వర్గాల్లో తీవ్ర ఆందోళన కలిగిస్తోంది. ఇలాంటి చర్యల వలన వైద్యులు తమ వృత్తికి సరైన న్యాయం చేయలేరు. ఆడపిల్లలు వైద్య వృత్తిలోకి రావాలంటే భయపడే పరిస్థితి నెలకొంటుంది. ఇది మంచి పరిణామం కాదు. ఇలాంటి దాడులను ప్రతి ఒక్కరూ ఖండించాలి.

– వి.కనకప్పారావు, ప్రభుత్వ వైద్యాధికారి, వాడచీపురుపల్లి

# ‘మినరల్’ మోసం!

- గ్రామాల్లో సరిగా శుద్ధి చేయని తాగునీరు అమ్మకం
- మినరల్ పేరిట జనరల్ వాటర్ అందిస్తున్న వైనం
- అనధికారిక ప్లాంట్లతో సొమ్ము చేసుకుంటున్న వ్యాపారులు
- కన్నెత్తి చూడని అధికార యంత్రాంగం

నీటిలో ఫ్లోరైడ్ ప్రభావం.. పరిశ్రమలు, గృహ వ్యర్థాలతో పెరుగుతున్న జల కాలుష్యం.. ఏ నీరు తాగితే ఏమవుతోందోనన్న భయం.. దీంతో ప్రతి ఒక్కరూ మినరల్ వాటర్ వైపు పరుగులు పెడుతున్నారు. దీన్ని అనుకూలంగా మార్చుకుంటున్న మినరల్ వాటర్ ప్లాంట్ల యాజమాన్యాలు కనీస నాణ్యతా ప్రమాణాలు పాటించకుండా ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నాయి. పెందుర్తి నియోజకవర్గంలో చాలా చోట్ల సాధారణ నీటినే మినరల్ వాటర్ పేరిట విక్రయించి, వ్యాపారులు దండిగా ఆర్జిస్తున్నారు.



సక్రమంగా నడవని ఎన్టీఆర్ సుజల ప్రాజెక్ట్



సబ్బవరానికి సరఫరా చేసేందుకు సిద్ధంగా ఉన్న నాణ్యత లేని మంచినీటి ప్యాకెట్ల బస్తాలు

పెందుర్తి: గ్రామాల్లో మినరల్ వాటర్ మాఫియా విచ్చలవిడితనం పెరిగిపోతోంది. ఎక్కడికక్కడ మినరల్ వాటర్ ప్లాంట్లు పుట్టగొడుగుల్లా వెలుస్తున్నాయి. తగిన క్లోరినేషన్/ఫిల్టరేషన్ లేకుండా సాధారణ నీటినే మినరల్ వాటర్ పేరిట విక్రయిస్తూ ప్రజల్ని దోచుకుంటున్నారు. ఈ మాయదారి వ్యాపారాన్ని మామూళ్లకు కక్కుర్తిపడి అధికారులు సైతం పట్టించుకోకపోవడం ప్రజల ఆరోగ్యంపై తీవ్ర ప్రభావం చూపిస్తోందన్న ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి.

**నీటిలో ఫ్లోరైడ్ ప్రభావం**

పెందుర్తి పట్టణ, గ్రామీణ ప్రాంతాలతో పాటు సబ్బవరంలో కూడా చాలా చోట్ల భూగర్భ జలాల్లో ఫ్లోరైడ్(తెల్లసుద్ద) శాతం అధికంగా ఉంది. దీంతో ప్రజలు కాస్త ఆర్థిక ఇబ్బందులున్నా శుద్ధి చేసిన నీటిని కొనుగోలు చేసేందుకే ఆసక్తి కనబరుస్తున్నారు. ప్రస్తుతం ఆయా ప్రాంతాల్లో రోజూ రూ.లక్షల్లో నీటి వ్యాపారం జరుగుతోంది. విచిత్రమేంటంటే ఇందులో మినరల్ వాటర్ ప్లాంట్లుగా చెప్పుకుంటున్న 80–90 శాతం ప్లాంట్‌లకు అసలు అనుమతులే లేవు. అయినా వీటిని యథేచ్ఛగా నిర్వహిస్తుండటం విస్మయానికి గురిచేస్తుంది.

**10–20 ప్లాంట్లకే అనుమతి**

నియోజకవర్గంలో ఎక్కడ బోరు తవ్వినా తెల్ల సుద్ద ప్రభావం తప్పనిసరి. దైనందిన అవసరాలకు తప్ప, తాగడానికి, వంటకు ఈ నీటిని వినియోగించడం చాలా తక్కువ. దీంతో వంట కోసం జీవీఎంసీ అందించే కుళాయి నీటిని, తాగేందుకు మినరల్ వాటర్ ప్లాంట్లను ఆశ్రయించక తప్పని స్థితి. ప్రజల నుంచి డిమాండ్ ఉండడంతో నియోజకవర్గంలోని సబ్బవరం, పెందుర్తి ప్రాంతాల్లో వాటర్‌ప్లాంట్‌లు రోజురోజుకూ పెరుగుతున్నాయి. ప్రస్తుతం నియోజకవర్గంలో 120కి పైగా వాటర్‌ప్లాంట్‌లు ఉన్నట్లు అంచనా. ఇందులో కేవలం 10 నుంచి 20 ప్లాంట్లకు మాత్రమే అనుమతులున్నాయి. చాలా ప్లాంట్లు బోరు నీటిని క్యాన్లలో నింపి, అందులో క్లోరిన్ ట్యాబ్లెట్లు వేసి దాన్నే మినరల్ వాటర్‌గా విక్రయిస్తున్నారు.

**వాటర్ ప్లాంట్ ఏర్పాటు చేయాలంటే..**

మినరల్ వాటర్ ప్లాంట్ ఏర్పాటుకు ఏడాదికి కనీసం రూ.10 నుంచి రూ.15 లక్షలు పెట్టుబడి. బ్యూరో ఆఫ్ ఇండియన్ స్టాండర్డ్స్(బీఐఎస్) నిబంధనలు పాటించడంతోపాటు, ఐఎస్ఐ సర్టిఫికెట్ తప్పనిసరి. ప్లాంట్‌లో ఫార్మసిస్టులు, ఇతర వర్కర్లు ఉండాలి. వారికి ప్లాంట్ యజమానులే క్రమం తప్పకుండా ఆరోగ్య పరీక్షలు చేయించాలి. నీటిలో మినరల్స్ ఎంత శాతం ఉన్నాయో ఫార్మసిస్ట్ నిర్ధారిస్తారు. నియోజకవర్గంలోని ఒకటీ అరా తప్ప ప్లాంట్లలో ఫార్మసిస్టుల ఊసే లేదు. ప్లాంట్లలో పనిచేసే సిబ్బందికి అరునెలలకోసారి వైద్య పరీక్షలు నిర్వహించాలి. ఎవరికైనా అంటువ్యాధులు ఉంటే అక్కడి నీటి ద్వారా ఇతరులకు సోకే ప్రమాదం ఉంది. అందుకే వైద్య పరీక్షలు తప్పనిసరి.

**ఫిల్టర్లు మార్చకుండానే..**

మినరల్ వాటర్ ప్లాంట్లలో ప్రతి 10 వేల లీటర్ల నీటికి ఒకసారి ఫిల్టర్లు మార్చాలి. యాజమాన్యాలు మాత్రం నెలల తరబడి వీటిని మార్చకుండానే నీటిని సరఫరా చేస్తున్నారు. కొన్ని సందర్భాల్లో బోరు నీరే నేరుగా వినియోగదారులకు అందిస్తున్నారు. ఫిల్టర్లు మార్చకపోవడంతో బ్యాక్టీరియా పెరగడం, నాచు వంటివి పేరుకుపోయి ఆ నీరు తాగిన వారు అనారోగ్యం పాలవుతున్నారు.

**ప్యాకెట్ నీరు సురక్షితం కాదు**

ప్లాస్టిక్ ప్యాకెట్ల ద్వారా విక్రయిస్తున్న నీరు మంచిది కాదని వైద్య నిపుణులు చెప్తున్నారు. 20 లీటర్ల మినరల్ వాటర్‌ను రూ.20కి విక్రయించడం సాధ్యం కాదు. కానీ కొన్నిచోట్ల రూ.10కి కూడా విక్రయిస్తున్నారంటే ఆ నీటి నాణ్యత ఏపాటితో అర్థమవుతుంది. ప్లాస్టిక్ నియంత్రణకు తూట్లు పొడుస్తూ చాలా ప్లాంట్లలో ఇప్పటికీ మంచినీటి ప్యాకెట్ల ఉత్పత్తి, విక్రయాలు జరుగుతున్నాయి. మినరల్ వాటర్ ప్లాంట్లపై ఆహార భద్రత అధికారులు నిరంతరం పర్యవేక్షణ చేయాలి. మామూళ్ల మత్తులో ఆ యంత్రాంగం ఆ బాధ్యత తమదేనన్న విషయాన్ని మర్చిపోయినట్టున్నారని ప్రజలు ఆక్షేపిస్తున్నారు. గత కొన్నేళ్లుగా నియోజకవర్గంలో ఒక్క ప్లాంట్‌పై చర్యలు తీసుకున్న దాఖలాల్లేవు. ఇప్పటికైనా అధికారులు స్పందించి అనుమతి లేని ప్లాంట్లపై తగిన చర్యలు తీసుకుని, ప్రజారోగ్యాన్ని కాపాడాలని కోరుతున్నారు.

### నాణ్యత పాటించాలి

నాకు ఊహ తెలిసినప్పటి నుంచి ఇంట్లో మినరల్ వాటర్ క్యాన్లే వాడుతున్నాం. ప్రజలు నమ్మకంతో మినరల్ వాటర్‌ను కొనుగోలు చేస్తున్నారు. వ్యాపారులు కూడా బాధ్యతగా సురక్షిత తాగు నీటిని అందించాలి. నిబంధనలకు విరుద్ధంగా నిర్వహిస్తున్న వాటర్ ప్లాంట్లపై అధికారులు తగు చర్యలు తీసుకోవాలి. అప్పుడే మిగిలిన వాటర్ ప్లాంట్ల వాళ్లు కూడా పరిశుభ్రమైన నీటిని అందిస్తారు.

– సాయి, చినముషిడివాడ, పెందుర్తి

### ఆరా తీసి కొనుగోలు చేయాలి

పెందుర్తిలోని కొన్ని ప్రాంతాల్లో ఫ్లోరైడ్ అధికంగా ఉంది. ఆయా ప్రాంతాల వాసులు తాగు నీటిని బయటి నుంచే కొనుగోలు చేస్తున్నారు. ఇలాంటి వారు కొనుగోలు చేసే ముందు వ్యాపారులు అందిస్తున్న నీటి నాణ్యతపై ఆరా తీయాలి. నాణ్యత, నిబంధనలు పాటించే వారి నుంచే నీటిని కొనుగోలు చేయాలి. లేకుంటే ఆర్థికంగా, ఆరోగ్యపరంగా నష్టపోయే ప్రమాదం ఉంది. ప్రజలు తగు అవగాహన కలిగి ఉండాలి.

– డాక్టర్ అవంతి, సూపరింటెండెంట్, సీహెచ్‌సీ, పెందుర్తి

### కృష్ణాష్టమి వేడుకలు ప్రారంభం



శోభాయాత్ర నిర్వహిస్తున్న గోపీజనవల్లభస్వామి ఆలయ కమిటీ ప్రతినిధులు, భక్తులు

సింహాచలం: 98వ వార్డు పరిధి లక్ష్మీనరసింహనగర్‌లోని గోపీజనవల్లభస్వామి ఆలయంలో ఆదివారం కృష్ణాష్టమి వేడుకలు వైభవంగా ప్రారంభమయ్యాయి. సాయంత్రం ఉత్సవమూర్తులను పల్లకిలో అధిష్ఠింపజేసి శోభాయాత్ర వైభవంగా నిర్వహించారు. సోమవారం కృష్ణాష్టమి పురస్కరించుకుని ఉదయం 6 గంటలకు గోక్షీరాభిషేకం, 8 గంటల నుంచి సహస్రనామార్చన, విష్ణుసహస్రనామ పారాయణం, మధ్యాహ్నం అన్నసమారాధన, సాయంత్రం 4.30కు స్వామికి 108 రకాల ప్రసాద నివేదన, అనంతరం ఊంజల్‌సేవ నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ ప్రతినిధులు తెలిపారు. ఆ తర్వాత ఐదేళ్ల బాలలకు బాలకృష్ణుడు, గోపిక వేషధారణ పోటీలు, 6.30 నుంచి శ్రీ సరస్వతి నృత్య మందిర్ వారిచే భరత నాట్యప్రదర్శన ఉంటాయన్నారు.

### వైభవంగా శ్రీవారి కల్యాణం



శ్రీవారి కల్యాణం నిర్వహిస్తున్న అర్చకులు

పెందుర్తి: స్థానిక వేంకటాద్రిపై కొలువైన వేంకటేశ్వరస్వామి ఆలయంలో చాతుర్మాస దీక్షలో భాగంగా ఆదివారం ప్రత్యేక పూజా కార్యక్రమాలు జరిపారు. శ్రీనివాస హోమం, సుదర్శన హోమం నిర్వహించారు. ఆలయ ప్రధాన అర్చకుడు మహర్షి రామానుజాచార్యుల ఆధ్వర్యంలో శ్రీవారి కల్యాణం వైభవంగా చేశారు. భక్తులకు ప్రసాద వితరణ చేపట్టారు. అధిక సంఖ్యలో భక్తులు స్వామిని దర్శించుకున్నారు.

# కృష్ణాష్టమికి ఆలయాల ముస్తాబు



రాయపుర అగ్రహారంలో విద్యుత్ దీపాలతో అలంకరించిన కృష్ణ మందిరం



గోపాల్‌నగర్‌లో పూలమాలలతో కృష్ణుడి ఆలయానికి ముస్తాబు

సబ్బవరం: కృష్ణాష్టమి వేడుకలను పురస్కరించుకుని మండలంలోని పలు కృష్ణ మందిరాలు ముస్తాబయ్యాయి. మండల కేంద్రం సబ్బవరంలోని గోపాల్‌నగర్‌లో శ్రీకృష్ణ జయంతి వేడుకల నిర్వహణకు ఉత్సవ కమిటీ పెద్ద ఎత్తున ఏర్పాట్లు చేసింది. వేడుకల్లో భాగంగా ఆదివారం రాత్రి కలశ ప్రతిష్ఠ, భజనలు చేశారు. సోమవారం ఉదయం 6 గంటల నుంచి పూజా కార్యక్రమాలు, పంచామృతాభిషేకాలు నిర్వహించనున్నారు. మధ్యాహ్నం డీజే కోలాటం, సాయంత్రం ఉట్టి సంబరం, రాత్రికి డ్యాన్స్ బేబీ డ్యాన్స్ సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు కమిటీ తెలిపింది.

రాయపుర అగ్రహారంలోని కృష్ణ మందిరాన్ని రంగురంగుల విద్యుత్ దీపాలతో అలంకరించారు. సోమవారం ఉదయం నుంచి స్వామి వారికి ప్రత్యేక పూజలు నిర్వహించనున్నట్లు ఆలయ ధర్మకర్త నక్కెళ్ల అచ్చిబాబు తెలిపారు. మధ్యాహ్నం అన్నసమారాధన, సాయంత్రం పలు సాంస్కృతిక కార్యక్రమాలు, పోటీలు ఉంటాయన్నారు.

### రక్తదాన శిబిరానికి స్పందన



రక్తదాతలకు ప్రశంసాపత్రాలు అందిస్తున్న దూది వెంకటరమణ

పెందుర్తి: ఉప ముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్ జన్మదినోత్సవాల్లో భాగంగా ఎస్ఆర్ పురంలో ఆదివారం నిర్వహించిన రక్తదాన శిబిరానికి చక్కటి స్పందన లభించింది. సర్పంచ్ దూది విజయలక్ష్మి వెంకటరమణ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో లైఫ్ షేర్ బ్లడ్ బ్యాంక్ ప్రతినిధులు 42 యూనిట్ల రక్తాన్ని సేకరించారు. నాయకుడు దూది వెంకటరమణ రక్తదాతలకు ప్రశంసాపత్రాలు అందించారు. శిబిరంలో గ్రామ పెద్దలు, బ్లడ్ బ్యాంక్ ప్రతినిధులు పాల్గొన్నారు.

# ఎన్నాళ్లీ కుక్కల బెడద!

పరవాడ: మండలంలోని వెన్నలపాలెం గ్రామంలో వీధి కుక్కలతో గ్రామీణులు బెంబేలెత్తిపోతున్నారు. గ్రామంలో రోడ్లు, వీధులు, మాంసం, చేపల దుకాణాలు ఇలా ఎక్కడపడితే అక్కడ గుంపులు గుంపులుగా సంచరిస్తున్న గ్రామ సింహాలతో భయాందోళనలు చెందుతున్నారు. గుంపులుగా చేరి దారినపోయే పాదచారులు, ద్విచక్ర వాహనదారుల వెంటపడుతున్నాయి. ఇక్కడ కల్యాణ మండపం ఏరియాలో వీధి కుక్కలు అత్యధికంగా సంచరిస్తూ, మండపంలో శుభకార్యాలకు వచ్చేవారిపై దాడులకు పాల్పడుతున్నట్లు స్థానికులు వాపోతున్నారు. వీధుల్లో సంచరిస్తున్న వీధి కుక్కల కారణంగా మహిళలు ఇళ్లు దాటి బయటకు రావడానికి భయపడుతున్నారు. రాత్రి సమయంలో వీధుల్లో సంచరిస్తూ అరుపులు కేకలతో ప్రజలకు కంటి మీద కునుకులేకుండా చేస్తున్నాయని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వీధి కుక్కల నియంత్రణకు చర్యలు చేపట్టాలని పంచాయతీ అధికారులకు ఎన్నిసార్లు మొరపెట్టుకున్నా ఫలితం కనిపించట్లేదని ఆక్షేపిస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి గ్రామంలో కుక్కల బెడదను నివారించాలని స్థానికులు కోరుతున్నారు.



వెన్నలపాలెం కల్యాణమండపం వద్ద రోడ్డుపై సంచరిస్తున్న వీధి కుక్కలు

# సాగర తీరం.. ఉల్లాసభరితం



తిక్కవానిపాలెం తీరంలో సముద్ర స్నానాలతో సందడి చేస్తున్న పర్యాటకులు

పరవాడ: మండలంలోని ముత్యాలమ్మపాలెం, తిక్కవానిపాలెం సముద్ర తీర ప్రాంతాలు ఆదివారం పర్యాటకులతో కిక్కిరిసిపోయాయి. పట్టణ, గ్రామీణ ప్రాంతాల నుంచి తరలివచ్చిన పర్యాటకులు తీరంలో ఇసుక తిన్నెలపై క్రికెట్, కబడ్డీ, వాలీబాల్, బైక్ రైడింగ్‌లు చేస్తూ ఉల్లాసంగా గడిపారు. యువత సినీ సాంగ్స్‌కు ఉత్సాహంగా డ్యాన్సులు చేస్తూ, సందడి చేశారు. తీరంలో గొడుగులు, వంతెన కింద చేరి వెంట తెచ్చుకున్న బిర్యానీలు, ఇతర ఆహార పదార్థాలు ఆరగించారు. అనంతరం సాయంత్రం వరకు సముద్ర స్నానాలు చేసి, తిరుగుముఖం పట్టారు.

# ఆనాటి ఆ స్నేహమానందగీతం



సబ్బవరం ప్రభుత్వ ఉన్నత పాఠశాల 2003-04 టెన్త్ బ్యాచ్ విద్యార్థులు

సబ్బవరం: రెండు దశాబ్దాల స్నేహ బంధం వారిది. స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో పదో తరగతి వరకు చదువుకున్నారు. 2003–04 బ్యాచ్‌లో టెన్త్ పూర్తి చేసుకుని, బతుకు బాటలో ముందుకెళ్లారు. తామంతా మళ్లీ ఓసారి కలిసి, అప్పటి జ్ఞాపకాలను నెమరువేసుకోవాలనుకున్నారు. కొందరు విద్యార్థులు నడుం బిగించారు. వారి ప్రయత్న ఫలితంగా ఆదివారం వీరి తొలి ఆత్మీయ సమ్మేళనానికి స్థానిక జూనియర్ కళాశాల వేదికయింది. వీరిలో చాలా మంది 20 ఏళ్ల తర్వాత ఇప్పుడే కలుసుకోవడం. దీంతో ఒకరినొకరు పరిచయం చేసుకుంటూ, స్కూల్ డేస్‌ను గుర్తు చేసుకున్నారు. అప్పటి అల్లరి చేష్టల్ని చెప్పుకుంటూ ఆనందంలో మునిగితేలారు. ప్రస్తుత స్థితిగతులను వెల్లడించి, బ్యాచ్‌లో ఎవరికి ఏ కష్టం వచ్చినా, మిగిలిన వారంతా అండగా నిలవాలని తీర్మానించుకున్నారు. తమకు విద్యాబుద్ధులు నేర్పిన సూర్యచంద్రరావు మాస్టర్‌ని ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో పూర్వ విద్యార్థులు కర్రి శ్రీనివాసరావు, నమ్మి నర్సింగరావు, దాడి జనార్దన్, కొమ్మోజు సతీష్, పెన్నం వెంకటేష్, గవర రవికుమార్, సారిపల్లి అప్పలనాయుడు, గవర బొజ్జన్న, గొంతిన అచ్చెన్నాయుడు, రాపర్తి అప్పలరాజు, శశికళ, పుష్ప, హారిక, పిల్లి శివకుమార్, ఉల్లి అప్పారావు తదితరులు పాల్గొన్నారు.

పెందుర్తి: పాతికేళ్ల క్రితం పదో తరగతి పూర్తి చేసుకుని, వివిధ ప్రాంతాల్లో స్థిరపడిన పూర్వ విద్యార్థుల ఆత్మీయ కలయికకు స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాల ఆదివారం వేదికయింది. 1998–99 టెన్త్ బ్యాచ్‌కు చెందిన విద్యార్థులు సిల్వర్ జూబ్లీ వేడుకల్ని ఘనంగా నిర్వహించుకున్నారు. వీరిలో కొందరు విదేశాల్లో, ఇంకొందరు ఇతర రాష్ట్రాల్లో, మరి కొందరు స్థానికంగా ప్రభుత్వ ఉద్యోగులుగా, వ్యాపారులుగా స్థిరపడ్డారు. వారంతా కలిసి తమ చిన్ననాటి జ్ఞాపకాలను నెమరువేసుకున్నారు. ఆటపాటలతో సందడి చేశారు.

అప్పటి తమ గురువుల్ని ఘనంగా సత్కరించి, వారి ఆశీస్సులు పొందారు. తమ జ్ఞాపకాలను సెల్‌ఫోన్లలో భద్రపరచుకున్నారు. సహపంక్తి భోజనాలు చేసి, సాయంత్ర వరకు సందడిగా గడిపారు. ఎన్నో మధుర జ్ఞాపకాలను మూటగట్టుకుని వీడ్కోలు పలికారు.



1998-99 టెన్త్ బ్యాచ్ పెందుర్తి ప్రభుత్వ ఉన్నత పాఠశాల విద్యార్థులు

### విస్తృతంగా వాహనాల తనిఖీలు

విశాఖ విద్య: ఎన్ఏడీ నుంచి గోపాలపట్నం వెళ్లే బీఆర్టీఎస్ దారిలో ట్రాఫిక్ పోలీసులు ఆదివారం విస్తృతంగా వాహన తనిఖీ చేశారు. ట్రాఫిక్ ఎస్సై విజయ్ కుమార్ ఆధ్వర్యంలో వాహనదారులను నిలిపి రోడ్డు నిబంధనలపై అవగాహన కల్పించారు. వాహనాలకు సంబంధించిన పత్రాలు, డ్రైవింగ్ లైసెన్సు ఉందా లేదా అనేది అడిగి తెలుసుకున్నారు.